నేడు సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ సమావేశం

గోల్కొండ: బక్రీద్, బోనాల పండుగ ఏర్పాట్లపై ఈనెల 29న (నేడు) సెంట్రల్ పీస్ అండ్ మైత్రి కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు కమిటీ కార్యదర్శి కౌసరుద్దీన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు గోల్కొండ బంజారి దర్వాజ వద్ద గల షాలీమార్ బ్లాంకెట్ హాల్‌లో జరిగే సమావేశానికి సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ జి.చంద్రమోహన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని అలాగే సౌత్ వెస్ట్ జోన్ ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

వీరవనిత అహల్యాబాయి



పూజారి నర్సింహాచార్యులను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: వందలాది శివాలయాలను కాపాడిన వీరవనిత అహల్యాబాయి అని గుడిమల్కాపూర్ బీజేపీ నాయకుడు దేవర వంశీ అన్నారు. ఆమె జయంతిని పురస్కరించుకుని పార్టీ పిలుపు మేరకు వివిధ శివాలయాల్లో బుధవారం ప్రత్యేక పూజలు చేసి ఆలయ పూజారులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాం పరిపాలనలో ఆలయాలను ధ్వంసం చేసేందుకు ఓ ముష్కర ముఠా ఉండేదని వారి చేతుల్లో శివాలయాలు నాశనం కాకుండా ఎదుర్కొన్న అహల్యాబాయి ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు.

అక్రమ నిర్మాణాలు.. తప్పని తిప్పలు..!



రోడ్డులో ఇరుక్కున్న 108 అంబులెన్స్

జియాగూడ: అక్రమ నిర్మాణాల కారణంగా రోగిని తీసుకెళ్తున్న ఓ అంబులెన్సు మూలమలుపులో ఇరుక్కుపోయిన ఘటన జియాగూడలో బుధవారం జరిగింది. ఇందిరానగర్‌లోని డోర్‌బస్తీ విద్యశ్రీ స్కూల్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి అకస్మాత్తుగా తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు 108 కు ఫోన్ చేశారు. అంబులెన్సులో రోగిని తీసుకుని వెళ్తుండగా విద్యశ్రీ స్కూల్ నుంచి జియాగూడ వాటర్ కార్యాలయానికి వెళ్లే క్రమంలో మూలమలుపు వద్ద అంబులెన్సు ఇరుక్కుపోయింది. స్థానికుల సహాయంతో అక్కడి నుంచి వెళ్లింది. కానీ రోడ్డు వరకు అక్రమ అరుగులు, చెబుత్రాలు నిర్మించడం వల్లే అంబులెన్సు రావడం ఇబ్బందిగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జియాగూడలోని ప్రతి బస్తీలో ఉన్న అరుగులను తొలగించాలని బస్తీలవాసులు కోరుతున్నారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

గోల్కొండ: పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఆసిఫ్‌నగర్ ఏసీపీ విజయ్ శ్రీనివాస్ సూచించారు. మెహిదీపట్నం పోలీస్‌స్టేషన్‌లో పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యుల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బక్రీద్ పండుగకు గొర్రెల అమ్మకాల వల్ల ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చూడాలన్నారు. హైదరాబాద్ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని ఇదే కొనసాగించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. అలాగే బోనాలు పండుగలను కూడా కలిసికట్టుగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెహిదీపట్నం ఇన్‌స్పెక్టర్ మల్లేశం, నాయకులు మొజంఖాన్, కౌసరుద్దీన్, ఇమ్రాన్ అలీఖాన్ తదితరులు ఉన్నారు.

బట్రాజు కులస్తులు ఐక్యంగా ఉండాలి



గన్‌ఫౌండ్రీ: రాష్ట్రవ్యాప్తంగా బట్రాజు కులస్తులంతా ఐక్యం కావాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. రవీంద్రభారతిలో రాష్ట్ర బట్రాజు సంఘం ఆధ్వర్యంలో ఉగాది కవి సమ్మేళనం వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కవులకు ప్రముఖ కవి రాళ్లబండి శేషం రాజు కవి పురస్కారాలను ప్రదానం చేశారు. అంతకుముందు వివిధ అంశాలపై పలువురు తమ కవితలను వినిపించారు. కార్యక్రమంలో రాష్ట్ర బట్రాజు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కూరపాటి భూపతి రాజు, దేవరాజు విష్ణువర్ధన్, రాళ్లబండి కృష్ణమోహన్‌రాజు, ప్రతికంఠం పూర్ణచందర్‌రాజు, ఆర్.కె.ఎం.రాజు, బ్రహ్మాండభేరి గోపరాజు, కూరపాటి రంగరాజు, కె.నరసింహారాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా శిబిరాలు కిటకిట..!

ముమ్మరంగా వేసవి శిక్షణ తరగతులు

- తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహణ
- గతంలో కంటే రెట్టింపు సంఖ్యలో పాల్గొంటున్న క్రీడాకారులు
- తల్లిదండ్రులకూ యోగా, జుంబా డ్యాన్స్ ఏర్పాటు



స్టేడియంలో ఆటలు ఆడుతున్న క్రీడాకారులు

గన్‌ఫౌండ్రీ: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని స్టేడియాలతో పాటు జిల్లాకేంద్రాల్లో నిర్వహిస్తోన్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు అనూహ్య స్పందన వస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా జూన్ 6 వరకు కొనసాగనున్న శిబిరాల్లో పాల్గొంటున్న యువ క్రీడాకారులకు అవసరమైన అన్ని ఏర్పాట్లను తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ కల్పించింది. క్రీడా సామగ్రిని అందించడంతో పాటు ఆయా క్రీడాంశాల్లో అసిస్టెంట్ కోచ్‌లుగా వ్యవహరించే అర్హులైన సీనియర్ ప్లేయర్లకు గౌరవ వేతనం కూడా పెంచింది. దీంతో ప్రతి 20 మందికి క్రీడాకారులకు కోచ్ చొప్పున వివిధ క్రీడాంశాల్లో శిక్షణ అందిస్తున్నారు. నగరంలో గతంలో 2500 మంది క్రీడాకారులు వేసవి శిక్షణ శిబిరాల్లో పాల్గొనగా ఈ యేడు ఇప్పటికే దాదాపు 5 వేల మంది పాల్గొనేందుకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇంకా చేసుకునే వారి సంఖ్య పెరుగుతూనే వస్తోంది.

గతంలో కంటే రెట్టింపు..

వేసవి శిక్షణ శిబిరాలు నామమాత్రంగా నిర్వహించకుండా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ అందుబాటులోకి తీసుకురావడం పిల్లలతో పాటు తల్లిదండ్రులను కూడా క్యాంపుల్లో భాగస్వామ్యం చేయడంతో గతం కంటే రెట్టింపు సంఖ్యలో పేర్లు నమోదు చేసుకున్నారు.

సందడిగా స్టేడియాలు..

ఈ యేడు జంట నగరాల స్టేడియాల్లో ప్రయోగాత్మకంగా వేసవి శిక్షణ శిబిరాల్లో పాల్గొనే విద్యార్థుల తల్లిదండ్రులకు యోగా, జుంబా డ్యాన్స్ ఉచితంగా ఏర్పాటు చేస్తుండడంతో పిల్లలతో పాటు తల్లిదండ్రులు కూడా వస్తుండడంతో స్టేడియాలు సందడిగా కనిపిస్తున్నాయి. క్రీడాకారులకు మెడికల్ సదుపాయాలతో పాటు తాగునీరు, వసతి కమ్యూనికేషన్ వ్యవస్థను పటిష్టం చేయడంతో క్యాంప్‌కు విపరీతమైన క్రేజ్ ఏర్పడింది.



చాంపియన్లుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా..

సమ్మర్ కోచింగ్ క్యాంపులో ప్రతిభ చూపిన విద్యార్థిని, విద్యార్థుల సమాచారాన్ని నిక్షిప్తం చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో వారు నమోదు చేసుకున్న వివరాల ద్వారా ఆయా క్రీడా పోటీల సందర్భంగా ఆసక్తి ఉన్నవారిని ఆయా క్రీడా పోటీల్లో పాల్గొనేలా స్పోర్ట్స్ స్కూల్ అకాడమీల సెలక్షన్ల సందర్భంగా సమాచారం ఇవ్వాలని స్పోర్ట్స్ అథారిటీ అధికారులు భావిస్తున్నారు. అంతేగాకుండా వారికి క్రీడలపై ఆసక్తిని పెంపొందించేలా ఏడాది పొడవునా కార్యక్రమాలు నిర్వహిస్తే వారిని అందులోనూ భాగస్వామ్యం చేసేలా ఆలోచన చేస్తున్నారు. కేవలం సరదా కోసం సమ్మర్ క్యాంపుల్లో పాల్గొనడమే కాకుండా భవిష్యత్తు చాంపియన్లుగా తీర్చిదిద్దే లక్ష్యంగా తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ కృషి చేస్తోంది.

పారిశుద్ధ్య సమస్యల్లేకుండా చూడాలి



బస్తీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్, అదనపు కమిషనర్ రఘుప్రసాద్ రావు

యాకుత్‌పురా: బక్రీద్ సందర్భంగా పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ కోరారు. స్థానిక కార్పొరేటర్లు, జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ (ఆరోగ్యం, పారిశుద్ధ్య) రఘు ప్రసాద్, చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ వెంకన్నతో కలిసి యాకుత్‌పురాలోని పలు ప్రాంతాల్లో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బక్రీద్ సందర్భంగా కుర్బానీ చేసిన జంతు వ్యర్థాలు వేసేందుకు గార్బేజ్ కవర్లను పెద్ద మొత్తంలో పంపిణీ చేయాలన్నారు. తలాబ్ చంచలం, పత్తర్‌గట్టీ, సంతోష్‌నగర్, డబీర్‌పురా డివిజన్ల కార్పొరేటర్లు డాక్టర్ సమీనా బేగం, సయ్యద్ సోహెల్ ఖాద్రీ, ముజఫర్ హుస్సేన్, అలాందర్ వాలాజాహి, జీహెచ్‌ఎంసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టరూ..!



జియాగూడ: పురానాపూల్ జాతీయ రహదారిని కొన్ని నెలల క్రితం పైప్‌లైన్ పనులు కోసం తవ్వారు. అయితే పనులు పూర్తయినా మరమ్మతులు చేపట్టకపోవడంతో రహదారి గతుకుల మయంగా మారింది. దీంతో వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఉస్మానియాలో హెల్ప్ లైన్ సేవలు ప్రారంభం



సేవలను ప్రారంభిస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాకేశ్ సహాయ్

అఫ్జల్‌గంజ్: ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌లో 24*7 ప్రత్యేక హెల్ప్‌లైన్ రోగి సహాయక సేవలను హాస్పిటల్ సూపరింటెండెంట్ రాకేష్ సహాయ్‌తో కలిసి బీఎస్‌బీ హ్యూమన్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ప్రతినిధి సల్మాన్‌బాబు ఖాన్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌లో రోగులకు నిరంతరాయంగా సేవలందించేందుకు హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్‌కు చెందిన 20 మందికి పైగా శిక్షణ పొందిన స్వచ్ఛంద సేవకుల బృందం మూడు షిఫ్టులుగా రోగులకు సేవలు అందిస్తుందని పేర్కొన్నారు. రాకేష్ సహాయ్ మాట్లాడుతూ.. వాహన సౌలభ్యం (వీల్ చైర్లు, స్ట్రెచర్లు) ఇవ్వడమే కాకుండా వివిధ విభాగాలకు రోగులను నడిపించడం, ఓపీ సేవల్లో సహకరించడం, గుర్తు తెలియని, అనాథ రోగులకు వైద్యం అందించడంలో కీలకంగా పనిచేస్తారన్నారు. హాస్పిటల్ పరిసరాల్లో కనిపించే అనాథ రోగులను సోషల్ హెల్త్ వర్కర్ల సహాయంతో శుభ్రం చేసి, బట్టలు వేసి, వైద్యం పొందేలా సహకరిస్తారన్నారు. అత్యవసర వైద్య సేవల్లో సుమారు 25 శాతం కేసులు రాత్రి వేళల్లోనే వస్తున్నాయన్నారు. రోజు 120 నుంచి 130 మందికి సేవలు అందిస్తున్న డయాలసిస్ కేంద్రం, శస్త్రచికిత్స కోసం కూడా 24 గీ 7 సహాయం అవసరమవుతుందన్నారు. యూనిట్ల మధ్య రోగుల తరలింపునకు ఈ సేవలు ఎంతగానో సహాయపడనున్నాయని చెప్పారు. అత్యవసర విభాగం పక్కన ఉన్న ఓపీ బ్లాక్ ర్యాంప్ పక్కనున్న ఖాళీ ప్రదేశాన్ని ఒక వార్ రూమ్‌లా మార్చామన్నారు. అక్కడే ప్రత్యేక హెల్ప్‌లైన్ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. రోగులు హెల్ప్‌లైన్ నెంబర్ 77802 88622 లో సంప్రదించవచ్చన్నారు.

కురుమ సంఘం ఎన్నికల నిర్వహణకు కమిటీ



కమిటీకి నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం

అఫ్జల్‌గంజ్: రాష్ట్ర కురుమ సంఘం ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల కమిటీని ఏర్పాటు చేశామని రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం కురుమ పేర్కొన్నారు. ముస్లింపూల్ వంతెన వద్ద ఉన్న రాష్ట్ర సంఘం భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కమిటీ చైర్మన్‌గా న్యాయవాది ఎ.శ్రీనివాస్ కురుమ, సభ్యులుగా గొరిగే కృష్ణ కురుమ, న్యాయవాది, కె.సదానందం, డి.ప్రవీణ్ కుమార్, డి.ప్రకాశ్ కుమార్‌ను నియమించినట్లు తెలిపారు. ఈ కమిటీ గ్రామాలు, మండలాలు, జిల్లాలో పర్యటించి కురుమ సంఘం ఎన్నికలను పారదర్శకంగా నిర్వహిస్తుందని తెలిపారు. రాష్ట్ర ఎన్నికలను కూడా ఈ కమిటీ నేతృత్వంలో జరుగుతాయని పేర్కొన్నారు.

పునర్వైభవం దిశగా పబ్లిక్ గార్డెన్ సరస్సు..!



కొనసాగుతున్న పునరుద్ధరణ పనులు

నాంపల్లి: రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో పబ్లిక్ గార్డెన్ సరస్సుకు పునర్వైభవం రానున్నది. సీఎంఓ, ఉద్యానవన శాఖ అధికారుల చొరవతో ఎన్విరాన్‌మెంటల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా (ఈఎఫ్‌ఐ) సీఎస్‌ఆర్ ఎన్జీఓ సంస్థ పనులు చేపడుతున్నది. మొదటి దశ పునరుద్ధరణలో భాగంగా రూ.34.50 లక్షల వ్యయంతో సరస్సు చుట్టూ ముళ్లపొదలు, చెత్తాచెదారం, బురద తొలగింపు, కట్టల పునరుద్ధరణ, గ్రీనరీ పెంపునకు గడ్డి పెంపకంతో పాటు చుట్టూ 20 ప్యానెల్స్, నీటిని శుభ్రం చేసేందుకు అవసరమైన వ్యవస్థలను ఏర్పాటు చేయనున్నారు. జూన్ చివరి నాటికి సరస్సు పునరుద్ధరణ పనులు పూర్తి చేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఈఎఫ్‌ఐ ఎన్జీఓ వ్యవస్థాపకుడు అరుణ్‌కృష్ణమూర్తి తెలిపారు.

జామ్ తయారీపై డ్వాక్రా మహిళలకు శిక్షణ

ఏజీవర్సిటీ: శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం విద్యార్థులు జాతీయ సేవా పథకంలో భాగంగా డ్వాక్రా సంఘాల మహిళలకు బొప్పాయి జామ్, పుచ్చకాయ జూస్, మామిడి ఫ్రూట్ జామ్ తయారీ విధానంపై బుధవారం శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. మహిళలకు ప్రాసెసింగ్ టెక్నిక్స్ హైజినిక్, మార్కెటింగ్ పద్ధతులు, నిల్వ ఉంచుకునే విధానాలపై అవగాహన కల్పించారు. శిక్షణలో తెలుసుకున్న అంశాలపై ఇంటి వద్దే మహిళలు ఉపాధి అవకాశాలు కల్పించుకోవచ్చని తెలిపారు. వీటికి సంబంధించిన ముడి సరుకులను ఇంటి దగ్గరే తయారు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. 10 నుంచి 15 మంది వరకు బృందంగా ఏర్పడి వీటిని తయారు చేసి మార్కెటింగ్ చేసుకోవచ్చని వివరించారు.

కూలిన చెట్లు

గౌలిపురా: లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి ఆలయ సమీపంలో దేవీ పాన్ షాప్ దగ్గర అధికారులు చేపట్టిన ఇండ్ల కూల్చివేతల్లో రెండు చెట్లు సైతం నేలకొరిగాయి. ఇన్నాళ్లపాటు నీడ నిచ్చిన చెట్లు అధికారుల అత్యుత్సాహంతో కింద పడడంతో వాహనదారులు తీ్ర ఆగ్రహానికి గురయ్యారు. మరోవైపు చెట్టు కూలడంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు క్రమబద్ధీకరించారు.



ఇంజినీరింగ్ సీట్ల భర్తీ పారదర్శకంగా చేపట్టాలి



ప్రొఫెసర్ పురుషోత్తంకు వినతిపత్రం ఇస్తున్న మహేందర్

నాంపల్లి: ఇంజినీరింగ్ సీట్ల భర్తీ పారదర్శకంగా చేపట్టాలని కోరుతూ బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సెవెళ్ల మహేందర్ కోరారు. ఈమేరకు మాసబ్‌ట్యాంక్‌లోని రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ పురుషోత్తంకు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ప్రక్రియ మరింత మెరుగుపర్చాలని, విద్యార్థులకు అన్యాయం జరగకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.గణేశ్, ఉపాధ్యక్షుడు అంబటి తరుణ్‌రెడ్డి, లడ్డూ యాదవ్, కోశాధికారి యోగిరాజ్ సింగ్, కార్యదర్శి ప్రవీణ్, అధికార ప్రతినిధి శివ చంద్రగిరి, కార్యాలయ కార్యదర్శి కొంపల్లి అరవింద్ కుమార్, గోల్కొండ జిల్లా అధ్యక్షుడు నితిన్, హైదరాబాద్ జనరల్ సెక్రెటరీ పిట్లం అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై మహిళలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి



పప్పు మాత్రే, ఆనంద్‌సింగ్‌ను సత్కరించిన కరిష్మాసింగ్, సంజనా సింగ్

అబిడ్స్: మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని గోషామహల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకుడు పప్పు మాత్రే, ఆనంద్ సింగ్ పేర్కొన్నారు. ధూల్‌పేట రహీంపురా గౌండ్ల మఠంలో ప్రపంచ మహిళా రుతుక్రమం దినోత్సవాన్ని సంఘ సేవకురాలు కరిష్మాసింగ్, సంజన సింగ్, ఓషికా సింగ్, సారికా సింగ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పప్పు మాత్రే, ఆనంద్ సింగ్ మాట్లాడుతూ.. ఆరోగ్యంగా ఉంటే జీవితం ఆనందంగా ఉంటుందన్నారు. అనంతరం కరిష్మాసింగ్, సంజన సింగ్, ఓషికా సింగ్, సారికా సింగ్, నిఖిత సింగ్ మాట్లాడుతూ.. మహిళల ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టి వారికి అన్ని విధాలా అండగా నిలుస్తున్నామన్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే నేరాలకు అడ్డుకట్ట



పీస్ కమిటీ సభ్యులతో టోలిచౌకి ఇన్‌స్పెక్టర్ రమేశ్‌నాయక్

గోల్కొండ: ప్రజల సహకారంతోనే నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చని టోలిచౌకి ఇన్‌స్పెక్టర్ ఎల్.రమేశ్‌నాయక్ అన్నారు. టోలిచౌకీ అజీజ్‌బాగ్‌లోని పోలీస్‌స్టేషన్‌లో వివిధ బస్తీలు, కాలనీల పెద్దలు, సంక్షేమ సంఘాల ప్రతినిధులతో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేరాల అదుపు కోసమే ప్రభుత్వం కొత్తగా పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేసిందన్నారు. టోలిచౌకీ వేగంగా అభివృద్ధి చెందుతున్న వ్యాపార కూడలి అని, ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలీసులకు తమ సహాయ సహకారాలు ఉంటాయని ఈ సందర్భంగా టోలిచౌకీ అక్బర్‌పురా సంక్షేమ సంఘం ప్రతినిధి జగన్నాథం పేర్కొన్నారు.

మహ్మద్ ప్రవక్తను కించపరిచిన వారిపై చర్యలు తీసుకోవాలి

గోల్కొండ: యూట్యూబ్‌లో మహ్మద్ ప్రవక్తను కించపరిచిన యూట్యూబర్ చిలుక ప్రవీణ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్ నగర అదనపు కమిషనర్ విక్రమ్‌సింగ్ మాన్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ.. చిలుక ప్రవీణ్ వ్యాఖ్యలు చట్టవిరుద్ధమని అతడిని పట్టుకునేందుకు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే అతడిపై పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, ముస్తా అహ్మద్ తదితరులు ఉన్నారు.



నగర అదనపు కమిషనర్ విక్రమ్‌సింగ్‌మాన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్



పంటలను పరిశీలించిన ఉద్యాన శాస్త్రవేత్తలు



ఏజీవర్సిటీ: శ్రీకొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉద్యాన శాస్త్రవేత్తలు విద్యార్థులతో కలిసి క్షేత్రస్థాయిలో పంటలను బుధవారం పరిశీలించారు. మొయినాబాద్ మండల పరిధిలోని కాశింబౌలి, అమ్డాపూర్ గ్రామాల్లో జాతీయ సేవా పథకంలో భాగంగా రైతులు పండిస్తున్న టమాట, మిరప, సొరకాయ, మామిడి, సపోటా, బొప్పాయి, గులాబీ తదితర పంటలను పరిశీలించారు. ఆయా రైతులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. నివారణకు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు, అనుసరించాల్సిన పద్ధతులు, ఎరువుల యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. ప్రధానంగా పంటల్లో వచ్చే నూతన వంగడాలను ఎప్పటికప్పుడు రైతులు తెలుసుకోవాలని పేర్కొంటూ వాటిని అమలు చేయాలని సూచించారు. సరైన యాజమాన్య పద్ధతుల ద్వారానే అధిక దిగుబడి పొంది గిట్టుబాటు ధర లభిస్తుందని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. కీటక శాస్త్ర నిపుణులు, డాక్టర్ మానస, డాక్టర్ వేణుగోపాల్, వ్యాధి నిపుణులు వి.కృష్ణవేణి ఆధ్వర్యంలో వివిధ పూలు, కూరగాయలు, పండ్ల తోటలకు చీడపీడల నివారణకు చేపట్టాల్సిన పద్ధతులను రైతులకు వివరించారు. కీటకాల్లో కూడా మిత్ర, శత్రు కీటకాలు ఉంటాయని వాటికి అనుగుణంగా ఎరువులను తగిన మోతాదులో వాడాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా అధిక దిగుబడి కోసం సేంద్రియ ఎరువులను వాడాలని... వీలైనంతవరకు రసాయన ఎరువల వినియోగాన్ని తగ్గించుకోవాలన్నారు. కూరగాయల విభాగపు శాస్త్రవేత్త ఎ.వి.ఎస్.లావణ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్ల్, విద్యార్థులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9010221230
9010463222
9989616273